క్లుప్తంగా

బాధ్యతల స్వీకరణ



బాల్కొండ: ఆర్మూర్ రూరల్ సీఐగా మంగళవారం బాల్కొండ మండల కేంద్రంలోని రూరల్ సీఐ కార్యాలయంలో శ్రీధర్ రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. ఇంతకు ముందు సీఐగా చేసిన గోవర్ధన్‌రెడ్డి హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని యోగేశ్వర కాలనీలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారినుంచి రూ.28,870 నగదు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు.

పశువైద్య శిబిరం

రుద్రూర్: కోటగిరి మండలం సుద్దులంలో మంగళవారం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాడి రైతులకు ఉచితంగా మందులు అందజేశారు. మండల పశు వైద్యాధికారి సురేష్ కుమార్ సర్పంచ్ గోపు సాయిలు, ఉప సర్పంచ్ రాధిక, పశు వైద్యాధికారి సంతోష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు.

విద్యార్థులకు కార్పెట్ల వితరణ

బాల్కొండ: ముప్కాల్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే నిర్మల రెండు కార్పెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్ట పడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై సురేశ్, పాఠశాల ప్రత్యేకాధికారిణి వినోద, తదితరుల పాల్గొన్నారు.

9వ తరగతి ప్రారంభం

కమ్మర్‌పల్లి: అమీర్‌నగర్‌లో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం 9వ తరగతి క్లాసులు ప్రారంభించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ నుంచి అనుమతి రావడంతో ఎంఈవో ఆంధ్రయ్య ప్రారంభించారు. సర్పంచ్ గంగాధర్, హెచ్‌ఎం శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు ప్రకాష్ నాయక్ పాల్గొన్నారు.

మారంపల్లి నుంచి డొంకేశ్వర్‌కు రోడ్డు వేయాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): మారంపల్లి నుంచి డొంకేశ్వర్ మండల కేంద్రానికి వెళ్లడానికి బీటీ రోడ్డు వేయాలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా అధ్యక్షుడు గంగాధర్ మారంపల్లి గ్రామస్తుల తరపున డిమాండ్ చేశారు. మట్టితో ఉన్న ఈ బైపాస్ రోడ్డును తారు రోడ్డుగా మారిస్తే ప్రయాణం సులభంగా చేయవచ్చని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కూడా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ రోడ్డు పూర్తయితే ఆర్మూర్, ధర్మాబాద్, బైంసా ప్రాంతాలకు కూడా వెళ్లడానికి అవకాశం ఏర్పడుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఈ ఐదు కిలో మీటర్ల రోడ్డును బీటీగా మార్చాలని కోరారు.

వ్యాసరచన పోటీలు



డొంకేశ్వర్(ఆర్మూర్): జంతు సంక్షేమ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో పాఠశాల విద్యార్థులకు జంతు సంక్షేమం-పౌరుల బాధ్యత అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. మండల స్థాయి పోటీల్లో నెగ్గిన సుమారు 46 మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. పరీక్ష అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు జంతు సంక్షేమంపై అవగాహన కల్పించారు. పోటీల్లో గెలుపొందిన వారికి త్వరలోనే జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగన్నాథచారి తెలిపారు. ఏడీ బాలిక్ అహ్మద్, బసవ రెడి పాల్గొన్నారు.

అరణ్య అర్బన్ పార్క్ సందర్శన



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మంగళవారం మాక్లూర్ మండలంలోని అరణ్య అర్బన్ పార్క్‌ను సందర్శించారు. చెట్ల జాతుల గురించి వాటి ప్రాముఖ్యత, ఉపయోగాల గురించి అటవీ శాఖాధికారులు వివరించారు. పాఠశాల కర్‌స్పాండెంట్ గుజరాతి ప్రకాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంక్సాపూర్ విద్యార్థుల ప్రతిభ

వేల్పూర్: అంక్సాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శ్రీకాంత్, అభినవ్ అగస్త్య ఫౌండేషన్ వారు నిర్వహించిన జిజ్ఞాస 2024 సైన్స్‌ఫెయిర్‌లో ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించినట్లు గైడ్ టీచర్ పి.రఘునాథ్ తెలిపారు. హెచ్‌ఎం మల్లీశ్వరి, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

టీచర్లు ఫుల్.. విద్యార్థులు నిల్

- ఇదీ మారంపల్లి స్కూల్ పరిస్థితి
- స్కూల్లో మొత్తం విద్యార్థులు 20 మందే
- పదో తరగతిలో ఒక్కరు కూడా లేని వైనం
- గ్రామస్తుల సహకారం కోరుతున్న టీచర్లు



ఆరో తరగతిలో ముగ్గురు విద్యార్థులకు పాఠాలు చెబుతున్న టీచర్

డొంకేశ్వర్(ఆర్మూర్): సరిపడా టీచర్లు ఉన్నా పాఠాలు వినేందుకు విద్యార్థులు లేక తరగతి గదులు బోసిపోతున్నాయి. మారంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రస్తుత పరిస్థితి ఇదీ. ఇంకా ఆశ్చర్యపోయే విషయం ఏంటంటే పేరుకు హైస్కూల్ అయినా ఇక్కడ పదో తరగతి చదివే విద్యార్థి ఒక్కరూ కూడా లేరు. దీంతో ఆ గదికి తాళం వేసి ఉంచారు. కొన్నేళ్లుగా ఈ పాఠశాలలో విద్యార్థుల శాతం క్రమంగా తగ్గుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఐతే, ఇక్కడి ఉపాధ్యాయులకు గ్రామస్తుల సహకారం లభించకపోవడంతో వచ్చిన వారికే పాఠాలు చెబుతున్నారు. 1998 వరకు ప్రాథమిక పాఠశాలగా ఉన్న ఈ స్కూల్ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయ్యింది. ప్రతి క్లాసుకి 20 మందికి తగ్గకుండా తరగతులను నిర్వహించారు. కానీ, ఐదారేళ్లుగా విద్యార్థులు పాఠశాలకు రావడం మానేశారు. విశాలమైన తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, ఆడుకునేందుకు పెద్ద మైదానం, సకల సౌకర్యాలు ఉన్నా గ్రామానికి చెందిన విద్యార్థులు వేరే స్కూళ్లకు వెళ్తున్నారు. మారంపల్లిలో ఇంగ్లీష్ మీడియం విద్య ఉనప్పటికీ పక్కనున్న తొండాకూర్ ప్రభుత్వ పాఠశాలకు వెళ్లడం విడ్డూరంగా అనిపిస్తోంది. ప్రయివేటు పాఠశాలలకు వెళ్తున్న వారి సంఖ్య వందకు పైనే ఉంటుంది. మారంపల్లి ఉన్నత పాఠశాల పరిస్థితి రోజురోజుకు దిగజారి మూతపడే స్థాయికి వస్తున్నా ఇటు విద్యా శాఖాధికారులు, అటు గ్రామస్తుల్లో చలనం కలగడం లేదు. ప్రభుత్వ బడికి ఊరి పిల్లలను పంపించాలని టీచర్లు ఇంటింటికీ తిరిగినా, సమావేశాల్లో ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పరిస్థితి మారడం లేదని టీచర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తులు తమకు సహకారం అందించి పిల్లల సంఖ్యను పెంచి పాఠశాలను కాపాడుకోవాలని టీచర్లు కోరుతున్నారు.



విద్యార్థులు లేక బోసిపోతున్న పదో తరగతి గది

తరగతుల వారీగా ఉన్న విద్యార్థులు

తరగతి	విద్యార్థులు
6	03
7	06
8	08
9	06
10	00

గ్రామస్తుల సహకారం అవసరం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించినా పిల్లలను పంపడం లేదు. ఖాళీ తరగతి గదుల్లో పాఠాలు చెప్పడం మాకు కూడా ఇబ్బందిగానే అనిపిస్తోంది. ఇప్పటికైనా గ్రామస్తులు సహకరించి పాఠశాలలో పిల్లల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలి. – స్వర్ణలత, పాఠశాల హెచ్‌ఎం

నిధులు ఉన్నాయా.. లేవా?

సర్వసభ్య సమావేశంలో సర్పంచుల ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

బాల్కొండ: ముప్కాల్ మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ సామ పద్మ అధ్యక్షతన మంగళవారం వాడివేడిగా కొనసాగింది. గత ప్రభుత్వ హయాంలో శిలాఫలకాలు వేసిన రోడ్లు, హెల్త్ సబ్ సెంటర్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయా, నిధులు ఉన్నాయా లేవా అని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ప్రశ్నించారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం అధికారులు పట్టించుకోవడం లేదని సభ్యులు మండిపడ్డారు. ఇలా అనేక సమస్యలపై సభ్యులు ప్రశ్నించడంతో సర్వ సభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. రానున్న వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. పదవీకాలం ముగియడంతో మండల పరిషత్ తరఫున సర్పంచ్‌లను ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ బద్దం నర్సవ్వ, వైస్ ఎంపీపీ ఆకుల చిన్నరాజన్న, కోఆప్షన్ సభ్యుడు మునీరొద్దీన్, ఎంపీడీవో దామోదర్, తహసీల్దార్ వనజ రాణి, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ విండో చైర్మన్ ఎన్నిక వాయిదా

రెంజల్(బోధన్): బీఆర్ఎస్ మార్క్ రాజకీయాలకు అధికార కాంగ్రెస్ నాయకులు చెక్ పెడుతున్నారు. మంగళవారం జరగాల్సిన రెంజల్ సహకార సంఘం చైర్మన్ ఎన్నికను శాంతి భద్రతల సమస్యగా చూపుతూ అధికారులు వాయిదా వేశారు. మంగళవారం చైర్మన్ ఎన్నికకు మూహూర్తం నిర్ణయించారు. ఐదు రోజులు గడువు ఉండటంతో ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్న మొయినొద్దిన్ తన మద్దతుదారులైన డైరెక్టర్‌లను విహారయాత్రకు తీసుకెళ్లారు. మెజార్టీ డైరెక్టర్లు బీఆర్ఎస్ మద్దతుదారులు కావడంతో అధికార కాంగ్రెస్ రాత్రికి రాత్రే చక్రం తిప్పింది. పోలీసుల సహకారంతో విహారయాత్రలో ఉన్న ముగ్గురు డైరెక్టర్‌లను ఇంటికి రప్పించారు. మిగిలిన డైరెక్టర్లు నేరుగా విహారయాత్ర నుంచి రెంజల్ విండో కార్యాలయానికి మంగళవారం చేరుకున్నారు. ఎన్నికల అధికారి సత్యనారాయణ రాకుండానే శాంతి భద్రతల సమస్యను ఎత్తి చూపుతూ ఎన్నికలను వాయిదా వేయాలని రెంజల్ విండో కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు. ఆరుగురు డైరెక్టర్‌లు మాత్రమే హాజరవడంతో ఎన్నికలను అధికారులు వాయిదా వేశారు. మిగిలిన డైరెక్టర్‌లు కాంగ్రెస్ పంచన చేరినట్లు ప్రచారం జరుగుతోంది. ఎన్నికను ప్రశాంతంగా నిర్వహించేందుకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. బోధన్ రూరల్ సీఐ పర్యవేక్షణలో రెంజల్, కోటగిరి, ఎడపల్లి ఎస్సైలు ఉదయ్‌కుమార్, సందీప్, విక్రంగౌడ్‌లతో పాటు ప్రత్యేక పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



కరపత్రాలను ఆవిష్కరిస్తూ..

మాక్లూర్: ప్రభుత్వ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ప్రజలకు సూచించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాల మంజూరు కోసం ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా తన దృష్టికి తేవాలన్నారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి, తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్, వల్లభాపూర్ సర్పంచ్ శిలారి మంజుల పాల్గొన్నారు. అనంతరం మాదాపూర్‌లో బీజేపీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

కరపత్రాల ఆవిష్కరణ

పెర్కిట్(ఆర్మూర్): మైనార్టీ విద్యార్థులతో పాటు బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు గురుకుల పాఠశాలలో ప్రవేశాలు పొంది బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో గల మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ప్రిన్సిపల్ సయ్యద్ హైదర్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు వాహనాల పంపిణీ

ఆర్మూర్: ఎమ్మెల్యే క్యాంప్ కార్యలయంలో మంగళవారం మహిళ, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలను అందజేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి చేతుల మీదుగా నలుగురు దివ్యాంగులకు రెండు రెట్రో మోటరైజెడ్ వెహికిల్, రెండూ వీల్ చైర్లను అందజేశారు. ఆర్మూర్ సీడీపీవో భార్గవి, అదనపు సీడీపీవో జ్యోతి, తదతరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ సర్వే పరిశీలన



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని కొటార్మూర్ గ్రామం నుంచి చేపడుతున్న 63వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధించిన సర్వేను ఆర్డీవో వినోద్ కుమార్ మంగళవారం పరిశీలించారు. కొటార్మూర్ నుంచి వేల్పూర్ మండలం లక్కోర వరకు 63వ నెంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారు. దీంతో స్థల సేకరణకు సర్వే చేపడుతున్నారు. సర్వేను ఆర్డీవో దగ్గరుండి పరిశీలించారు. సర్వే అండ్ ల్యాండ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శికారి రాజు, తహసీల్దార్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకాలపు వేతనం చెల్లించాలి

బోధన్: గ్రామ పంచాయతీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం గడిచిన ఏడాది 34 రోజులు చేసిన సమ్మె కాలానికి సంబంధించిన వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని డీఎల్‌పీవో ఆఫీసు ఎదుట నాయకులు, కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా మొదటి వారంలోనే కార్మికులకు వేతనాలు ఇవ్వాలని కోరారు. యూనియన్ సభ్యులు సీతారాం, రాజన్న, సింహాద్రి, సాయిలు పాల్గొన్నారు.

బూత్ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత దుగ్యాల ప్రదీప్

పెర్కిట్(ఆర్మూర్): బీజేపీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్ పిలుపునిచ్చారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎమ్మార్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించిన క్లస్టర్ యాత్ర సన్నాహక సమావేశానికి ప్రదీప్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో నిజామాబాద్, ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గాల మీదుగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో అత్యధికంగా ఎంపీ స్థానాల్లో విజయం సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగు నీరందించడంలో రాజకీయం తగదు



రుద్రూర్: పోతంగల్ మండలంలోని పంట పొలాలకు సాగు నీరందించడంలో రాజకీయ కోణం తగదని, రైతు శ్రేయస్సే ధ్యేయంగా ఉండాలని ఉమ్మడి మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎజాజ్ ఖాన్ అన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో మంగళవారం స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. సుంకిని, రాంగంగానగర్, సోంపూర్ కాలువ విషయమై గతంలో ఇద్దరు వ్యక్తులు అభ్యంతరం చెప్పడం వల్ల ఆ పని నిలిచిపోయిందన్నారు. ఇప్పటికైనా ఎలాంటి అభ్యంతరాలు తెలపకుండా ప్రతి గుంటకు సాగునీరందించేందుకు కృషి చేయాలని అన్నారు. నాయకులు దిలిప్, విఠల్, జుమ్మా ఖాన్, విజయ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడ్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

బాల్కొండ: మండల కేంద్రం శివారు హైదరాకుంటలోనికి నీటిని రాకుండా నిజాంసాగర్ కాలువను పూడ్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు మంగళవారం తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆర్మూర్ మండలం ఫతేపూర్‌కు చెందిన కొందరు రైతులు కాలువను పూడ్చివేయడం వల్ల నీరు రావడం లేదన్నారు. దీంతో కుంట కాస్తా ఎడారిగా మారిందన్నారు. కుంటలోకి నీరు రాకపోవడంతో కుంటను కూడ కొందరు కబ్జా చేస్తున్నారని అన్నారు.

సంక్షిప్తం

కుక్కలకు రేబిస్ టీకాలు

భీమ్‌గల్: జంతు సంక్షేమ పక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా పశువైద్య అధికారి డాక్టర్ జగన్నాథం ఆధ్వర్యంలో పశు సంవర్ధక శాఖ వారు గొర్రెలలో నీలి నాలుక నివారణ టీకాలు, కుక్కలలో రెబిస్ నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా పశువైద్యాధికారి జగన్నాథం మాట్లాడుతూ.. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్నవారికి రూ.1.50 లక్షల వరకు రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. జెడ్పీటీసీ చౌట్పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేష్, ఏడీ భరత్, మండల పశువైద్యాధికారి కష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

వేములపల్లి కిరణ్‌కు నివాళి

మాక్లూర్: స్వర్గీయ వేములపల్లి కిరణ్‌కుమార్ 33వ వర్ధంతి సభను మంగళవారం మాణిక్‌బండార్ వద్ద పీవైఎల్ నాయకులు ఘనంగా జరిపారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పీవైఎల్, ఏఐకేఎంఎస్ నాయకులు దుడ్డు గంగాధర్, నవీన్, దుర్గా ప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో మంగళవారం పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వర్ధంతి నిర్వహించారు. పీవైఎల్ జిల్లా కార్యదర్శి బట్టు రవి, జిల్లా నాయకులు గంగాధర్, మోహన్, లింబాద్రి, అబ్దుల్, సాహితీ, మమత, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

అమర వీరులకు నివాళులు

బాల్కొండ: ముప్కాల్ తహసీల్ కార్యాలయంలో అమరవీరులకు మంగళవారం ఘన నివాళులర్పించారు. మంగళవారం అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కార్యాలయంలో రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తహసీల్దార్ వనజ రాణి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

బాల్కొండ: బుధవారం వేల్పూర్ మండలం లక్కోరా ఏఎస్‌జీ ఫంక్షన్ హాలులో నిర్వహించే నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ ముప్కాల్ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కుష్టు వ్యాధిపై అవగాహన

- ఘనంగా కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం



బోధన్ పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది



ముప్కాల్ జీపీలో..



కోటగిరిలో..

సాక్షి నెట్‌వర్క్ : రాబోయే రోజుల్లో మన దేశాన్ని కుష్టు వ్యాధి రహితంగా మార్చాలని వైద్యులు పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాలో పలు చోట్ల వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహించి ప్రజలకు, పాఠశాలల విద్యార్థులకు కుష్టు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. కుష్టు వ్యాధిని శాశ్వతంగా నివారించడానికి ఆరోగ్య శాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని, ఈ వ్యాధికి అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స లభిస్తోందని తెలిపారు. ఈ వ్యాధి ఒకరి నుంచి ఒకరికి సోకదని, వంశపారంపర్యంగా రాదన్నారు. కానీ, నిర్లక్ష్యం చేస్తే వైకల్యం వచ్చే ప్రమాదం ఉందని, సకాలంలో చికిత్స తీసుకుంటే పూర్తిగా నయం అవుతుందన్నారు. అలాగే వైద్యారోగ్య సిబ్బంది, ప్రజలు, విద్యార్థులతో కలిసి స్పర్శ ప్రతిజ్ఞ చేయించారు.



నందిపేట: షాపూర్‌లో ..



ఆర్మూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో..

మహాత్ముడికి ఘన నివాళులు



డొంకేశ్వర్‌లో నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



రుద్రూర్‌లో..

జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో మంగళవారం పలు చోట్ల నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాన్ని నేతలు స్మరించుకున్నారు. – డొంకేశ్వర్/నందిపేట/రుద్రూర్/కమ్మర్‌పల్లి

నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

ఆర్మూర్‌టౌన్: మరమ్మతుల కారణంగా బుధవారం పట్టణంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు మున్సిపల్ కమిషనర్ చౌహాన్ తెలిపారు. గురువారం యథావిధిగా మిషన్ భగీరథ నీరు సరఫరా చేస్తామన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం

వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం బుధవారం వేల్పూర్ మండలం లక్కోర వద్ద గల ఏఎస్‌జీ ఫంక్షన్ హాలులో జరుగుతుందని బీఆర్ఎస్ నాయకులు తెలిపారు. మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అతిథిగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.

బల్దియా సర్వసభ్య సమావేశం

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ బల్దియా సర్వసభ్య సమావేశం చైర్ పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి అధ్యక్షతన బుధవారం నిర్వహించనున్నారు. సమావేశంలో బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు హాజరు కానున్నట్లు సమాచారం.


సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) - 12.30, 7.00, 10.20
	నా సామిరంగ (తెలుగు) - 3.50
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ - 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)- 11.20, 2.40, 6.00, 9.20
స్క్రీన్-4 –	కెప్టెన్ మిల్లర్ (తెలుగు) - 12.50, 4.00, 10.30
	హనుమాన్ (తెలుగు) - 7.10

మొరం టిప్పర్ల పట్టివేత



వర్ని (మోస్రా): మోస్రా మండలం చేనంబర్ తండా శివారులో అనుమతులు లేకుండా మొరం తవ్వుతున్న ఒక జేసీబీ, నాలుగు టిప్పర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను వర్ని పోలీసులకు అప్పగించారని తహసీల్దార్ శ్రీకాంత్‌రావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక, మొరం తరలించే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కళాశాల ఆవరణలోని మోటారు చోరీ

వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మోటార్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు కళాశాల ప్రిన్సిపల్ రవి కుమార్ తెలిపారు. కళాశాల పనివేళల తరువాత సోమవారం తాళాలు వేసి వెళ్లామని, గుర్తు తెలియని వ్యక్తులు కళాశాల ఆవరణలోకి చొరబడి తాగునీటి అవసరాలకు ఉపయోగించే మోటారును ఎత్తుకెళ్లారన్నారు. ఈ ఘటనపై వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కళాశాల ఆవరణలో అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు జరుగకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు.